# కొత్త సీసా - పాతమందు

(కథానిక)

మునిపల్లె రాజు

నేను వద్దో కుయ్యో మొర్రో అంటున్నా—ఆ జిల్లాకు ఆర్గనైజరుగా పంపించారు మా కంపెనీవాళ్లు. కొత్తవూరు. పరిచయంవున్న మనుషులెవ్వరూ లేరు. ఇళ్ళుమాత్రం కొల్లలుగా ఖాళీగా వున్నై—అసలు రెండో ప్రపంచయుద్ధం జరగనట్టే. ప్లీడర్ల బోర్డులు కూడా అంతే. కోకొల్లలు.

వెళ్ళిన వారంరోజుల్లోనే పెద్దవాడికి జ్వరం పెట్టుకొచ్చింది. మా ఆవిడ గంపెడు దిగులుతో మంచం పక్కనే కూర్చొని వంట ప్రయత్నం కూడా చెయ్యలేదు పొద్దుటినుంచీ. ఎరిగిన ఆడదిక్కు లేదు-యిల్లాలిని ఓదార్చేందుకుగాని, కాస్త తోడు కూర్చునేందుకుగాని.

దారిన పోతున్న ఒక మాష్టరుగారిని చూసి (ఆయన కళ్ళజోడు చూస్తే పంతులుగారే అనితోచింది) "ఈవూళ్ళో మంచి డాక్టరెవరండీ?" అని వినయంగా అడిగాను." "మంచి చెడ్డలు నిర్ణయించటానికి మనమెవరండీ?" అని ఆయన ఎదురుప్రశ్న వేసి ఆగకుండా సాగిపోయాడు.

మా ఆవిడ అన్నది: "ఈ నీళ్ళు పిల్లలకు పడలేదు."

"కావచ్చు" అన్నాను.

"కావచ్చేమిటండీ కావచ్చు. నీళ్ళు పట్టి ముదనష్టపు నీళ్ళంటుంటే."

"నిజమేనే. మరి పిల్లవాడికి నిమ్మళించాలంటావా, మీరు బయలుదేరివచ్చిన దారినే వెళ్లేందుకైనా?"

ఆవిడకు యీ మాటేమీ నచ్చలేదు.

అటువంటి సమయంలో ఆ బట్టతలాయన దేవుడల్లే యింటిముందు ప్రత్యక్షమైనాడు.

"ఈ వూళ్ళో వున్నది ముగ్గురే డాక్టర్లు. ఒకాయన గవర్నమెంటు డాక్టరు. ఇంకో ఆమె లేడీడాక్టరు. మూడో ఆయనకు యీ తాలూకా తాలూకా అంతా ప్రాక్టీసే."

మీరు నమ్మండి నమ్మకపోండి, మేం యిద్దరం కలుసుకోగానే, ఆ అపరిచిత పెద్దమనిషి నన్ను ఆ విధంగా పలకరించాడు. మా పెద్దవాడికి జబ్బుగా వున్న సంగతి ఆయనకు దేవుడే చెప్పివుండాలి.

"మరేం చేద్దామంటారు? తమరే ఆలోచించాలి. నేను బొత్తుగా కొత్తవాణ్ణి యిక్కడ."

"తొందరపడవాకండి. ఆ మూడో ఆయన యిప్పుడు వూళ్ళోనే వున్నాడు. గుర్రంబ్బండిలో కూర్చోబెట్టి యిలా చక్కావచ్చాను. ఇదుగో వస్తూండాలి."

ఆయనకు ధన్యవాదా లర్పించటం ఎట్లాగో తెలీదు.

"మీరు దయామయులు" అని మాత్రం ఆయన చేతిలో లెదర్ పోర్టుఫోలియోను చూస్తూ అనగలిగాను.

"ఏబ్బే ఇదేమంతభాగ్యమండీ. ఐతే ఇంకోమాట. యిక్కడ పెన్సిలిన్ బొత్తుగా దొరకదు. మీయింట్లో రెండు ట్యూబులుంటే పట్టుకు చక్కావచ్చాను. పోతే, మనకు డిస్టిల్డువాటర్ కావాలి. మన డాక్టరు దగ్గిరుంటుంది. ఫరవాలేదనుకోండి."

"తమరికి పెన్సిలిన్ కావాలని డాక్టరుగారు చెప్పాడన్నమాట."

"ఏబ్బే ఎంతమాట. ఆయన జ్వరానికిచ్చే మందేమిటో మనకు తెలుసుకదండీ."

ఇంతలో డాక్టరు వచ్చాడు. గుర్రబ్బండి దిగుతూనే "ఎవర్నయినా పెన్సిలిన్‌కోసం పంపించాలే" అన్నాడు. వారింకా రోగిని చూడలేదు.

"పిల్లవాణ్ణి చూచింతర్వాత—" అని కొంచెం నేను నసగినమాట నిజమే.

"ఏబ్బే ఎందుకండీ!" అని మాపాలిట దైవం వెంటనే అని, తోలు సంచీలోంచి పెన్సిలిన్ ట్యూబులు తీశారు పైకి.

మా పూర్వజన్మ సుకృతంవల్ల నైతేనేం, మా దేవుడిగారి పట్టుదలవల్ల నైతేనేం, డాక్టరుగారి మతిమరుపువల్లనైతేనేం-పిల్లవాడికి నాలుగు రోజుల్లోనే జ్వరం తగ్గింది. మా ఆవిడ పథ్యం పెట్టిన మర్నాడే పుట్టింటికి తట్టాబుట్టా వేసుక ప్రయాణం. అంతా అకస్మాత్తుగా జరిగింది. వేరే పురుక్కూ తెలీదు. కాని రైలు స్టేషనులో ఆ బట్టతల దేవుడు తిరిగి కన్పించాడు.

"సుఖంగా వెళ్ళిరండమ్మా."

ఆయనే కూలీలనూ మాట్లాడాడు. సామాన్లు ఎత్తించి అన్నీ సర్దారు., కాని థాంక్సు చెప్పాలన్నా నాకు సిగ్గు అడ్డం వచ్చింది.

"బాబాయిగారూ, మీ వుపకారానికి మీ కడుపునబుట్టి రుణం తీర్చుకుంటానండీ" అని నా బదులుగూడా ఆవిడే అనేసి రైలు కదలిపోయింది.

నేను పెన్సిలిన్ డబ్బు యిస్తానంటే ఆయన ససేమిరా పుచ్చుకోలేదు. మీ బిడ్డ ఒకటీ, నాబిడ్డ ఒకటీనా అండీ అని నన్ను నిలవదీసి అడిగారు.

ఆ తర్వాత ఒక పక్షంరోజులకుగాని వారి పునర్దర్శనం కాలేదు.

మళ్లీ చిరునవ్వూ. ఉపోద్ఘాతంలేని ఆపలకరింపే.

"కథలు రాస్తారుగదూ మీరు?"

"ఏదోకులాసాకొద్దీ. పెద్దవిశేషంగాగాదులెండి."

"కాని బహుపసందుగా రాస్తారండీ."

"తమరు ఏ కథ చదివి అలా అనుకొన్నారో."

"ఎబ్బే. మనకా అలవాటెప్పుడూ లేదు సుమా. ఏదో అనుకోగా,వింటం."

అప్పట్లో నేను రాయగారాయగా అచ్చయినది ఒక్కగానొక్క కథ. అదీ ప్రవాసాంధ్రులు నడుపుతున్న రాష్ట్రేతరాంధ్ర సోదరుల లిఖిత మాసపత్రికలో.

"తమరు బృహస్పతులు" అని నేను కాంప్లిమెంటు చెయ్యకుండా వుండలేకపోయాను.

"అది సరేగాని మాష్టరుగారూ. ఓ విషయం చెప్పాలని మరిచాను. ఇక్కడ ఖర్చులు జాస్తి, మీరా హోటల్లో భోంచేస్తున్నారు. కాస్టు ఆఫ్ లివింగ్ మండిపోతున్నది. పిల్లామేకా వున్నవాళ్లు. రేపంటూ వుండాలి."

మా ఆవిడే ఆ మాటలు విన్నట్లయితే యింకో సారి ఆయన కడుపునపుడతాననేది. నేను చౌకగా "చిత్తం"అన్నాను సగం విస్తుపోయి. ఎందుకంటే ఆ వూరంత చౌకవూరు యిదివరకు లేదు. ఇక వుండదు. ఏమిటా యీ దేవుడు యిలా అన్నారు అని నాలో నేను మథనపడ్డ మాట నిజం.

అక్టోబరులో మా బంధువులింట్లో పెళ్ళికి నేను వుత్తర జిల్లాలు వెళ్ళవలసి వచ్చింది. సరిగ్గా కట్నాలు చదివింపులవేళకి పెళ్ళిపందిరి చేరగలిగాను. పర్సులోచెయ్యిపెట్టి చిన్ననోట్లను లెక్కించుకొంటుంటే, వెనకనించి ఎవరో తట్టారు భుజంమీద. వారే, ఆ బట్టతలే. ఆ దేవుడే.

"స్వామీ."

"అమ్మాయివాళ్ళుగూడా పెళ్ళికి వచ్చారు. కన్పించారా?"

నిజానికి నా భార్య ఆడపెళ్ళివారివేపు బంధువు. నేను మగ పెళ్ళివారి తరఫున ఆతిథ్యంతీసుకొంటున్నాను.

"తమరికి మా బావగారు బంధువులా?"అని దేవుడిగార్ని ధైర్యంచేసి అడిగాను.

"పాపం ఏదోశుభకార్యమనుకోండి మాష్టారూ. మీకుఖర్చులమీద ఖర్చులు తగులుతున్నై."

అడిగిన ప్రశ్నకు అది సమాధానం కాదని తెలిసిగూడా నేను నోరుమూసుకు కూచున్నా. అయినా వారిమేలు నేను యీ జన్మలో మరువగలనా? కాని నా భార్య నన్ను సాగదీసి అడిగింది "ఆయన్నిగూడా మీరే తెచ్చారా ఏమిటి?"

"ఇది మరీబావుంది. ఏ పాపపుణ్యం నేనెరగను" అని నా నిరపరాధం నిరూపించుకున్నా ననుకోండి. అది వేరేసంగతి.

కట్నాల పందిట్లో మాయమయిపోయి మళ్ళీ ఆయన భోజనాలయింతర్వాత తాంబూలం వేసుకుంటూండగా తేలారు.

"మాష్టారూ"

"స్వామీ"

"చిన్నవిషయం. చిన్నవారు. వున్నదంతా ముందేవుంది. మీరో అయిదువేలకు ఇన్సూరెన్సు పాలసీ పుచ్చుకోండి. మా కంపెనీకి తిరుగులేదు. 14 డివిడెండు. హేమాహేమా డైరెక్టర్లు." ఒరలో నుంచి కత్తివచ్చినట్లుగా తోలుసంచిలోంచి ఆయన విజిటింగుకార్డు పైకివచ్చింది.

"బి. బృహస్పతి, ఏజెంట్
కల్పవృక్షా ఇన్సూరెన్సు కంపెనీ"

నేను మూర్ఛపోక తట్టుకొని, లాల్చీ జేబులోకి చేయి జొనిపి నా విజిటింగుకార్డు పైకితీశాను.

"—ఫలాని ఫలాని
డిస్ట్రిక్టు ఆర్గనైజర్
కామధేను ప్రూడెన్సియల్ భీమాకంపెనీ లిమిటెడ్"

ఆయన కళ్ళవంకచూడలేక తలదించుకొన్నాను. తల ఎత్తేసరికి ఆయనక్కడలేడు.

పెళ్ళిళ్లు చేయించి మా ట్రూపంతా నీళ్లుపడని ఆ వూరికే వచ్చిచేరాం. తలుపులకు తాళాలు తీయగానే కాళ్ళకు కార్డు తగిలింది.

"ఆర్గనైజర్ గారూ, నా చేతిలోంచి ఎవరూ తప్పించుకోలేదు. నేను చేసిన పొరపాటల్లా-మీరు మా వూరి హైస్కూలుకు కొత్తగా బదలీ అయి వచ్చిన ఇంగ్లీషు టీచరనుకోవటం-ఒక్కటే. అయితే నేం అదిచాలు. బి. బృహస్పతి. భీమా ఏజెంటు."

నో కామెంట్స్ప్లీజ్-అన్నానునాభార్యనుచూసి. ఆమె చేయబోయే కామెంటరీ నాకు తెలుసుగనక.

---

# అమెరికాలో విదేశ విద్యార్థులు

అమెరికాలోని అతిపెద్ద విశ్వకళా పరిషత్తులలో మిషిగన్ విశ్వకళా పరిషత్తు ఒకటి. ఈ విశ్వకళా పరిషత్తులో అంతర్జాతీయ సంబంధాలను పెంపొందించేవిషయంలో ఒక వినూత్నయత్నం జరిగింది. ఈ యత్నం ఎంతగా విజయవంతమయిందంటే, ఇది ప్రతి సంవత్సరం జరిగే ఒక పెద్ద కార్యక్రమంగా మారింది.

అమెరికాలోని విద్యాసంస్థలన్నిటిలోకీ పైసంస్థలోనే విదేశ విద్యార్థులు ఎక్కువమంది చదువుతున్నారు. ఈవిషయాన్ని ఆ విశ్వకళా పరిషత్తుయొక్క ఉపాధ్యాయ వర్గంవారు చాలా సంవత్సరాల క్రిందటనే గ్రహించారు. అప్పటినించే ఈ కార్యక్రమం ప్రారంభమయింది.

చాలామంది జీవితాలలో గృహం, కుటుంబ జీవితం కీలకమైన పాత్ర వహిస్తాయని గ్రహించిన మిషిగన్ రాష్ట్ర ఉపాధ్యాయ వర్గం వారు విద్యార్థులు, అంతర్జాతీయ విద్యార్థి సలహా సంస్థ తోడ్పాటుతో, సంవత్సరం పొడుగునా సాంఘిక కార్యక్రమాన్ని రూపొందించడానికి గాను స్థానిక పట్టణవాసుల సహకారాన్ని చేకూర్చుకున్నారు.

వివిధమైన లాంఛనాలు పాటించ నవసరం లేకుండా జరిగేవిందు, ఇలా ఏర్పాటు చేయబడిన కార్యక్రమాలలో ఒకటి. ఇది ఎంత విజయవంతమయిందంటే, ఇటువంటి విందులు ప్రతియేటా జరపడం పరిపాటిగా మారింది. ఈ సమావేశాలలో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులు ఒకరితో మరొకరు స్నేహం కుదుర్చుకునేవారు. విద్యార్థులు తమ తమ మాతృదేశాలకు తిరిగి వెళ్ళిన తరువాత కూడా ఉత్తర ప్రత్యుత్తరాలద్వారా వారిమధ్య స్నేహం కొనసాగుతూ వుంది. ఈ విందు సందర్భంలోనే స్థానిక కుటుంబాలవారు విద్యార్థులను "పెంచుకొనడం", విద్యార్థులు "పెంపుడు పోవడం" జరుగుతూ వుంటుంది. ఈ పద్ధతి ప్రకారం ప్రతి విద్యార్థికీ తాను స్వేచ్ఛగా వెళ్ళి వస్తూ వుండడానికీ, తన స్నేహితులను తీసుకుపోతూ వుండడానికీ ఒక ఇల్లు లభిస్తుంది. ఆ విద్యార్థి శని, ఆదివారాలు తమతో కులాసాగా గడిపి పోవడానికి గాను ఆ కుటుంబం వారు తరచు ఆహ్వానిస్తూ వుంటారు.

పరాయి దేశంలో వుండి చదువుకుంటున్న ఆ విద్యార్థులకు కొత్త ఏమీ అనిపించకుండా వుండేటందుకు రూపొందించబడిన కార్యక్రమంలో ఇంకా ఈ దిగువ అంశాలు కూడా వున్నాయి. ఉపాధ్యాయ వర్గంవారిచ్చే అనేకమైన ఆతిథ్యాలు విద్యార్థులు, తదితరులు ఏర్పాటుచేసే విందులు, శని ఆదివారాలలో జరిపే విహారాలు విద్యార్థులు తమ తీరిక సమయాలను వినియోగించుకుని కొత్తకొత్త వారితో చిరకాల స్నేహం ఏర్పరచుకొనడానికిగాను ఇంకా ఇతరమైన కార్యక్రమాలుకూడా వున్నాయి.

వీటినన్నిటినీ వివిధజాతులు, వివిధమతాలు, వివిధ సంప్రదాయాలకు చెందినవారు ఒకరిని మరొకరు మరింతగా అవగాహన చేసుకొనడానికి గాను జరుగుతున్న ప్రయత్నమిది అని అనవచ్చు. ఇంత వరకు జరిగిన దానినిబట్టి చూస్తే ఈ ప్రయత్నం చాలా విజయవంతమయిందనే చెప్పాలి. ★